క్లుప్తంగా

ఇండియా టీం విజయం సాధించాలి



ఐనవోలు : ఐసీసీ టీ–20 వరల్డ్‌కప్ క్రికెట్ ఫైనల్లో భారత్ విజయం సాధించి ప్రపంచ కప్ గెలుపొందాలని ఏకశిల పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ. బాబా ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులు ఇండియా టీం క్రీడాకారుల మాస్కులు ధరించి ముందస్తు వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవికిరణ్, ఉపాధ్యాయులు నరేష్, రవీందర్, రజినీకర్, రాజేష్, ప్రేమ్‌కుమార్, సుభాష్, మంగ పాల్గొన్నారు.

'ఎంజేపీ' ప్రిన్సిపాల్‌గా ఓదెల మల్లయ్య

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో గల మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలుర గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్‌గా ఓదెల మల్లయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కమలాపురం గురుకుల విద్యాలయంలో సేవలందించిన ఆయన ఇక్కడికి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన కురోజు దేవేందర్, ఉపాధ్యాయులు మల్లయ్యను అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా..

పర్వతగిరి : మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పీవీవీ.గణేశ్‌కుమార్ నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి సమక్షంలో శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పని చేసిన ప్రిన్సిపల్ పి.శ్రీదేవి ఆర్నెళ్లపాటు విదేశాలకు వెళ్లిన క్రమంలో ఆమె స్థానంలో గణేశ్‌కుమార్‌కు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేశ్‌కుమార్‌కు ఎంఎల్‌సీ కోఆర్డినేటర్ జయరాజు, ఉపాధ్యాయులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శలు..

నర్సంపేట : కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా ఆస్పత్రిలో ఆయన్ను ఆ పార్టీ నాయకుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదెలు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం, పట్టణ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు..

నర్సంపేట : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కడారి సత్యనారాయణను అతడి సతీమణి ఇందిర, 13వ వార్డులో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగానికి చెందిన పిన్నా భాస్కర్‌ను అతడి నాయనమ్మ సుశీల ఇటీవల మృతి చెందిన క్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్, నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎర్ర యాకూబ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. తొలుత యాకూబ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కొండూరులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపెల్లి శ్రీనివాసరావును అతడి కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు..

సంగెం: మండలంలోని పలు కుటుంబాలకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. గవిచర్లలో గుళ్లపల్లి సాయిలు, గుళ్ళపల్లి కుమార్, ఎల్గూర్‌స్టేషన్‌లో బొల్ల కుమార్, ఎల్గూర్ రంగంపేటలో బోనాల కృష్ణమూర్తి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రైతుబంధు మండల మాజీ కన్వీనర్ బొమ్మినేని మాధవరెడ్డి ఏడాది క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన గౌస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్‌ఎస్ నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సుంకరి శివ, తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల..

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక విలేకరి కొల్లూరి నాగరాజును కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ శుక్రవారం పరామర్శించారు. నాగరాజు కుమారుడు రేవంత్‌కుమార్ ఇటీవల జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించినట్లు తెలిపారు. పర్వతగిరి ఎంపీటీసీ మహేంద్ర, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో పూజలు

- తరలివచ్చిన భక్తులు
- సందడిగా మారిన ఆలయ ప్రాంగణం
- సమీప డంపింగ్‌యార్డు నుంచి వెదజల్లిన దుర్వాసన
- ఆగ్రహించిన భక్తులు



ఆలయ సమీపంలో పడేసిన చెత్తాచెదారం



మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కనకదుర్గ ఆలయ ప్రాంగణం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ సమీపంలో వనభోజనాలకు తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, పాడిపంటలు పండాలని మొక్కులు చెల్లించారు. ఆది నుంచి గొల్లకురుమలు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు.

పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆషాఢ, శ్రావణ మాసాల్లో కనకదుర్గాదేవి ఆలయానికి భక్తుల తాకిడి ఉంటుంది. శుక్రవారం భక్తులు వనభోజనాలకు రాగా ఆలయ సమీపంలోనే డంపింగ్‌యార్డు ఉండడంతో చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు ఆగ్రహించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తాచెదారం ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి ఇక్కడే డంపు చేయడం ద్వారా ఆలయానికి వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వనభోజనాలకు వచ్చిన భక్తులు సేద తీరేందుకు అనువైన ప్రదేశం లేకపోవడం, ఆలయ సమీపంలో డంపింగ్‌యార్డు ఉండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయం సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును తొలగించాలని భక్తులు కోరుతున్నారు. మండలంలోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారన్నార.

అమ్మవారి మహిమలు గొప్పవి



అనాది నుంచి ప్రతీ ఏటా ఆలయాన్ని మేమే శుద్ధి చేస్తున్నాం. ఆలయంలోని పుట్ట పెరుగుతూ వస్తుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. పూజలు చేసిన అనంతరం ఇక్కడే వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేస్తారు. కుటుంబ సభ్యులు ఆహ్లాదంగా గడుపుతారు.

– నాంపల్లి కవిత

డంపింగ్‌యార్డు నుంచి దుర్వాసన



పవిత్రమైన ఆలయం సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. దుర్వాసన వెదజల్లుతోంది. ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తొలగించాలి.

– నాంపల్లి మమత

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



అదుపుతప్పి పొలంలోకి వెళ్లిన కారు

ఐనవోలు : కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండలంలోని కొండపర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపర్తి మీదుగా బట్టుపల్లికి వెళ్లే రహదారిపై కంకర రోడ్డు తేలిఉండటంతో కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కారు బంపర్ ధ్వంసం అయ్యింది. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎనిమిది నెలలుగా రోడ్డు పనులు పూర్తికాకుండా ఉండటంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు జరుగుతున్నాయి. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహిస్తున్నారు.

చర్య తీసుకోవాలి

పరకాల : విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తకాలు, దుస్తులు అమ్మవద్దంటూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, మండల నాయకులు బొజ్జ హేమంత్, కోకిల ప్రేమ్, సాయి తేజ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు



అమృతమ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

దామెర : మండలంలోని పులుకుర్తిలో సుదీర్ఘ కాలంగా ఏఎన్‌ఎంగా పనిచేసిన అమృతమ్మకు గ్రామస్తులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. గ్రామంలో 15 సంవత్సరాలపాటు సేవలందించి హెల్త్ సూపర్‌వైజర్‌గా పదోన్నతిపై వెళ్తున్న అమతమ్మను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోవిందు అశోక్, గన్ను సరస్వతి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి హర్షం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు జానపట్ల సుమలత, బొల్లం వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెళ్ల మురళి, హెచ్ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, రాంబాబు, నగేశ్, కారోబార్ ఆనంద్ పాల్గొన్నారు.

గోదాం నిర్మించాలి



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో నందనం రైతుసేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో ఎరువుల గోదాం నిర్మించి రైతుల అవసరాలు తీర్చాలని రైతులు కోరారు. ఈ మేరకు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరక్టర్ రాజారపు రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ దయాకర్ వినతిపత్రం అందించినవారిలో ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓ కృష్ణవేణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని ఉపాధ్యాయ ఖాళీలతోపాటు ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాల శివకుమార్, కార్యకర్తలు ఆది, సూర్యతేజ, హేమంత్, సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నర్సంపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి వృక్షాలు, అడవుల అభివృద్ధికి పాటుపడాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు, సామాజిక సేవకుడు బెజ్జంకి ప్రభాకర్ కోరారు. ప్రపంచ వృక్ష దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయ ఆవరణలో ఆయన శుక్రవారం మామిడి, జామ మొక్కలను నాటి మాట్లాడారు. మొక్కలు నాటి ప్రకృతిని కాపాడి భావితరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో నాగరాజు, తదితరులు



హెచ్‌ఎంకు పుస్తకాలు అందిస్తున్న కవిత

నల్లబెల్లి : మండలంలోని కొండాపూర్‌లో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు కందకట్ల నాగరాజు రూ.10 వేల విలువైన నోట్ బుక్కులను అందించగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, మేడేపల్లి హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అంకం కృష్ణమూర్తి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ఉపాధ్యాయుడు నాగరాజు పుస్తకాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అసోసియేట్ మండల అధ్యక్షుడు పేరాల మల్లయ్య, నాయకులు దూపటి కృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు బానోత్ కృష్ణ, జ్యోతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మేడపల్లి హైస్కూల్‌కు..

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని జేడీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కవిత తెలిపారు. మండలంలోని మేడేపల్లి హైస్కూల్‌కు ఆమె శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 100 పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కృష్ణమూర్తికి ఆమె పుస్తకాలు అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

సంగెం : విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ కళావతి చెప్పారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆమె శుక్రవారం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ , యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థినులకు ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తోందన్నారు. కష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదగాలని, పదో తరగతి విద్యార్థినులందరూ 10 జీపీఏ సాధించాలని తెలిపారు. ఎంపీటీసీ మ ల్లయ్య, ఏపీఎం కిషన్, ప్రత్యేకాధికారి నీలిమ, పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఐనవోలు : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వనమాల కనపర్తి గ్రామాన్ని సందర్శించారు. ప్రజలు తమ ఇంటిచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఖాళీ డ్రంబులు, పాత్రల్లో నీటిని నిల్వ ఉంచుకండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పనులను, డంపింగ్ యార్డు, నర్సరీలను పరిశీలించారు. గ్రామంలో సీసీరోడ్లపై నీరు నిల్వ కుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోడ్డుకిరువైపుల పిచ్చి మొక్కలు పెరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, కార్యదర్శి జనుగాని అశోక్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే రేవూరి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బయ్య రాజు భార్య రజిత అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన బుచ్చికొండ మల్లారెడ్డి, కామారంలో ఎలగొండ సాంబ కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పర్వతగిరి రాజు, పరికిరాల వాసు, రేవూరి జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



దామెర : సంపత్ రావును పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : ఆపదలో ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో బీఆర్‌ఎస్ నాయకుడు బొల్లెబోయిన రవియాదవ్ తల్లి కేతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ కూస కుమారస్వామి, రేగుల రవి పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు తండ్రి రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం మండలంలోని దుర్గంపేట్‌లోని సంపత్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు.

పరకాలలో..

పరకాల : మండలంలోని పైడిపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బొచ్చు జనార్దన్, కొండి రాజశేఖర్, మునిగాల ఆగమ్మ, మంగలపల్లి శైలజ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, నాయకులు ప్రకాశ్‌రావు ఉన్నారు.

ఆలయ భూములను కాపాడాలి



ఆలయ భూమిని చదును చేసినట్లు చూపిస్తున్న మహేందర్

వేలేరు : మండలంలోని పీచరలో గల సమ్మక్క సారలమ్మ జాతర భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు కాపాడాలని జాతర కమిటీ చైర్మన్ కొయ్యడ మహేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పీచరకు చెందిన మండల తంబాజీ అనే వ్యక్తి సమ్మక్క సారలమ్మ ఆలయ భూములను అక్రమంగా చదును చేసి పత్తి సాగు చేస్తున్నాడని ఆరోపించారు. సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. స్పందించి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో లేబర్ శాఖ, సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తెలిపారు.

ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించిన దార్శనికుడు పీవీ

- ఎమ్మెల్యేలు రేవూరి, గండ్ర



పరకాల : పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



శాయంపేట : పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానారాయణరావు

పరకాల : ఆర్థిక సరళీకృత విధానాలకు ఆద్యుడు, భారత ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించిన దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొనియాడారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, చిన్నాల గోనాథ్, దుబాసి వెంకటస్వామి, మేరుగు శ్రీనివాస్, లక్కం శంకర్, బొచ్చు మోహన్, శ్రావన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : భారతదేశంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి సాహసోపేతమైన నిర్ణయాలతో బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేసిన మహనీయుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పత్తిపాక గ్రామంలో పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు కాగా ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మట్లాడుతూ.. పద్మశాలి కమ్యూనిటీ హాల్‌ను సహకార సంఘం సమావేశాలకు కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హాల్‌కు నిధులు సరిపోని పక్షంలో సీడీఎఫ్ నుంచి అదనంగా మరో రూ.5లక్షలు మంజూరు చేస్తానని, అతి త్వరలో నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పత్తిపాక, ప్రగతిసింగారం గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణానికి రూ. 30లక్షలతో ప్రతిపాదనలు పంపించామని, త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి సీడీఎఫ్ నుంచి రూ.3కోట్ల నిధులు కేటాయించగా పనులు పూర్తి అయ్యాయని వెల్లడించారు. మండలానికి రూ.30లక్షలతో అంబులెన్స్ కోసం నిధులు కేటాయించానని త్వరలో అంబులెన్స్ అందజేస్తామని అన్నారు. అనంతరం హుస్సేన్‌పల్లి, తహరాపూర్, గట్లకానిపర్తి గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీటీసీ ఐలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రకాశ్, నాయకులు రవి, శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, రఘుపతిరెడ్డి, కృష్ణమూర్తి, వలిహైదర్, జంగారెడ్డి, వెంకటరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపుల్లో పోలీసుల తనిఖీ



రాయపర్తి (వర్ధన్నపేట) : ప్రభుత్వం నిషేధించిన గుట్కా, అంబర్, తదితర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. వర్ధన్నపేటలోని పలు కిరాణా, పాన్ షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గుట్కా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పోలీసులు పిట్ట రమేశ్, తదితరులు పాల్గొన్నారు.